



అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607


# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక - 273 ఆదివారం 25 జనవరి 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### 27న ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు

న్యూఢిల్లీ **జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకుని పరభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బ్జడెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా 2లో...



## త్వరలో 31 జిల్లాల్లో కూడా

# ఫోరెన్సిక్ ఆడిట్

### ధరణి పోర్టల్ లొసుగుల వల్లే రిజిస్ట్రేషన్‌లలో అక్రమాలు

**ఫోరెన్సిక్ ఆడిట్‌తో సిద్దిపేట, సిరిసిల్లల్లో అక్రమాల గుర్తింపు**

**జిల్లాల్లోని 35 మండలాల్లో 48 మందిపై క్రిమినల్ కేసులు**

**ధరణి పోర్టల్ అక్రమాలపై ఉన్నతస్థాయి కమిటీ నివేదిక**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి**

హైదరాబాద్, **జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**
ధరణి పోర్టల్‌లోని లొసుగులను ఆసరాగా చేసుకొని ప్రభుత్వ భూములను కొల్లగొట్టినవారిని, రిజిస్ట్రేషన్‌ల చలానా సొమ్మును కాజేసినవారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని గత ప్రభుత్వంలోని పెద్దలు ప్రభుత్వ భూములను కాజేశారని, దీనిపై సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంస్థతో పైలట్ కింద ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించడం జరిగిందని ఇందులో అనేక అవినీతి



అక్రమాలు జరిగినట్లు ప్రాథమిక నివేదికలో స్పష్టమైందని ఆయన తెలిపారు. ఈ ఫోరెన్సిక్ నివేదికను పరిశీలించిన తర్వాత మిగిలిన 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని ప్రకటించారు. మిగతా 2లో...

## భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది



**ప్రపంచంలో అత్యధిక యువత మన దేశంలోనే ఉందన్న ప్రధానమంత్రి**

**యువతకు అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్న మోదీ**

**వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల ద్వారా విదేశాల్లోని భారత యువతకు అవకాశాలు లభిస్తాయని వెల్లడి**

**జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**
భారతదేశం సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యధిక యువత కలిగిన దేశం మనదని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 45 ప్రదేశాల్లో 18వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీ వర్చువల్‌గా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశం సంస్కరణల దిశగా ముందుకు సాగుతోందని, ఇందుకోసం వివిధ దేశాలతో వాణిజ్య, మొబిలిటీ రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు.తద్వారా భారతీయ యువతకు ప్రభుత్వం అనేక మిగతా 2లో...

## 27న దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

**వారానికి 5 రోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్**

**ప్రభుత్వ ఆమోదంలో జాప్యమే సమ్మెకు కారణం**

**9 సంఘాల ఐక్యవేదిక యూఎఫ్‌బీఈ సమ్మెకు పిలుపు**




## నైనీ బ్లాక్ టెండర్లపై విచారణ

### రంగంలోకి దిగిన ఇద్దరు కేంద్ర బృందం సభ్యులు



హైదరాబాద్, **జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**
నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల వివాదంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇద్దరు సభ్యుల సాంకేతిక కమిటీ సింగరేణి భవనానికి చేరుకుని విచారణను ప్రారంభించింది. సీఎస్ఆర్ నిధుల వినియోగం, టెండర్ నిబంధనలు వంటి అంశాలపై కేంద్ర బృందంమిగతా 2లో...

## ఇద్దరూ దోపిడీ దారులే

**సింగరేణపై శ్వేతపత్రం విడుదల చేయాలి**

**ఎపిని మించి సింగరేణి గనుల దోపిడీ**

**మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్**



హైదరాబాద్, **జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**
కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి సింగరేణిని దోచుకుంటున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నాయని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కుటుంబమే సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన.. మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. 2014 నుంచి ఇప్పటివరకు సింగరేణిలో గనులమిగతా 2లో...

## బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు

# కేటీఆర్ లీగల్ నోటీసులు

**వెంటనే తనకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్**

**నిరాధార, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారన్న కేటీఆర్**

**బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆగ్రహం**



హైదరాబాద్ **జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**
కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్, ఎంపీ ధర్మపురి అరవింద్ వెంటనే తనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసులు పంపించారు. బీజేపీ నేతలకు వేర్వేరుగా లీగల్ నోటీసులు జారీ చేశారు. తనపై, తన కుటుంబంపై నిరాధారమైన, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలుమిగతా 2లో...

## నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

### మంటల్లో ఇద్దరు పిల్లలు సహా ఆరుగురు!

**ఫర్నీచర్ షోరూమ్‌లో పెద్దఎత్తున మంటలు**

**రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్, బాహుబలి క్రెయిన్, రోబో**

**సహాయక చర్యలో జీహెచ్‌ఎంసీ, హైడ్రా,**

**జలమండలి, మెడికల్, విద్యుత్, అగ్నిమాపక సిబ్బంది**

**16 ఫైరింజన్లు, 20 ట్యాంకర్ల వినియోగం**

**భారీ పోలీస్ బందోబస్తు**

**రాత్రి వరకూ అదుపులోకి వచ్చిన మంటలు**



సుల్తాన్‌బజార్ **జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**
హైదరాబాద్ నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఫర్నీచర్ షోరూమ్‌లో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. లోపల ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు చిక్కుకున్నారు. మంటలు వ్యాపించడం.. పొగ కమ్ముకోవడం రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకంగా మారింది. మిగతా 2లో...



## శ్రీశైలం ప్రాజెక్టుకు డ్రిప్ నిధులు

**రూ.700 కోట్లతోప్లంజ్ పూల్ పనులు**

**మరో రూ. 90 కోట్లతో మరమ్మతులు**

అమరావతి, **జనవరి 24, :**
ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు ప్రధాన జలవనరుగా ఉన్న శ్రీశైలం ప్రాజెక్టునుడ్యాం రిహాబిలిటేషన్ ఇంప్లిమెంటేషన్ ప్రోగ్రామ్ (డ్రిప్–2) పరిధిలోకి తీసుకువచ్చే ప్రతిపాదనను అమల్లోకి తీసుకు రావాలని కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ)మిగతా 2లో...

## సింగరేణి విచ్ఛిన్నానికి బీఆర్ఎస్ కుట్ర

**టెండర్ల వివాదంలో సీఎం బామ్మర్ది పేరిట తప్పుడు ప్రచారం**

**ఆ పార్టీ కోరితే 2014 నుంచి నేటి వరకు విచారణ : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**



హైదరాబాద్ **జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**
సింగరేణి విచ్ఛిన్నానికి బీఆర్ఎస్ కుట్రలు పన్నుతోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. శనివారం హైదరాబాద్ లోని జ్యోతిరావు ఫూలే ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నైనీ కోల్ బ్లాక్ టెండర్లపై వస్తున్న కథనాలను కొట్టి పారేశారు. బీఆర్ఎస్‌తో పాటు ఓ పత్రికాధిపతి అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రభుత్వాన్ని అస్థిర పర్చేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఎవరి కండ్లల్లో ఆనందం చూడాలని రాస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ పత్రిక రాసిన కథనాన్ని రక్తి కట్టిస్తూ మాజీ మంత్రి హరీశ్‌రావు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి లేఖ రాయడం,మిగతా 2లో...

# త్వరలో 31 జిల్లాల్లో కూడా ఫోరెన్సిక్ ఆడిట్

**(మొదటి పేజీ తరువాయి)**

శనివారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడిన సంఘటనలపై ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. విచారణలో ఎదురైన అంశాలు,ఎవరి పాత్ర ఎంత? తెరవెనుక ఎవరైనా ఉన్నారా? రెవెన్యూ అధికారుల పాత్ర ఏమైనా ఉందా? వంటి అంశాలపై కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కమిటీ ప్రాథమిక నివేదికను పరిశీలించి మరికొన్ని సలహాలు సూచనలు చేస్తూ మరింత లోతైన విచారణ జరిపి తుది నివేదికను సమర్పించాలని సూచించారు. ధరణి పోర్టల్ ప్రారంభమైనప్పటినుంచి 35వేల లావాదేవీలు జరిగాయని ఇందులో ప్రాథమికంగా 4,848 లావాదేవీల్లో లోటుపాట్లు జరిగినట్లు గుర్తించడం జరిగిందని అయితే విచారణ తర్వాత 1109 డాక్యుమెంట్లకు సంబంధించి సుమారు నాలుగు కోట్ల రూపాయిలు ప్రభుత్వానికి చెల్లింపు జరగలేదని కమిటీ సభ్యులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం అనాలోచితంగా ఎలాంటి ముందుచూపు లేకుండా ఒక కుట్రపూరితంగా తీసుకువచ్చిన ధరణి పోర్టల్ లోని లొసుగులను ఆసరాగా చేసుకొని కొంతమంది అక్రమాలకు పాల్పడితే భూభారతి పోర్టల్ ద్వారా ఆడిట్ నిర్వహించి అక్రమాలను గుర్తించి తక్షణమే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టామని తెలిపారు. ఇందుకు సంబంధించి తొమ్మిది జిల్లాల్లోని 35 మండలాల్లో అక్రమాలకు పాల్పడిన 48 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వాస్తవ పరిస్దితి ఇలా ఉంటే ప్రతిపక్షంలో ఉన్న ఓ నాయకుడు వెయ్యి కోట్ల అవినీతి అని, మరో నాయకుడు పదివేల కోట్లు అని ఇంకొక్కరు భూభారతి పోర్టల్ అవినీతిమయమని నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇదిలావుంటే ఇప్పటికే మొదటి విడతలో నాలుగు వేల మంది శిక్షణ పొందిన సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేయగా ఆదివారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ లో మరో రెండు వేల మందికి లైసెన్స్‌లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ లైసెన్స్‌డ్ సర్వేయర్లతో రాష్ట్రంలో నక్షా లేని 373 గ్రామాల్లో రీసర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి లోకేష్ కుమార్, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇంటిలిజెన్స్ అదనపు డిజి విజయ్‌కుమార్ ,ఉన్నతస్థాయి కమిటీ సభ్యులు డిఐజీ ఎమ్. సుభాషిని, సిఎమ్ఆర్‌వో మకరంద్, ఏసీబీ ఎస్పీ సింధు శర్మ, సైబర్ క్రైమ్ డిఎస్పీ ఎ. సంపత్, ఎన్ఐసి ప్రతినిధి శ్రీనివాస్ , హోంశాఖ సలహాదారు పి. శరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి విచ్ఛిన్నానికి బీఆర్ఎస్ కుట్ర

**(మొదటి పేజీ తరువాయి)**

ఆ వెంటనే విచారణకు ఆదేశించడాన్ని తాను స్వాగతిస్తున్నట్టు చెప్పారు. ఆ పార్టీ కోరితే 2014 నుంచి నేటి వరకు సింగరేణిలో జరిగిన టెండర్లు, కేటాయింపులపై విచారణకు ఆదేశించేందుకు సిద్దంగా ఉన్నామని స్పష్టం చేశారు. సింగరేణి టెండర్లు, వాటికి సంబంధించిన ఫైళ్లు తన వద్దకు గానీ, రాష్ట్ర ప్రభుత్వం వద్దకు గాని రావని భట్టి స్పష్టం చేశారు.

పారదర్శకంగా సేవలందించేందుకు సంస్థకు చెందిన బోర్డు స్వయంప్రతిపత్తితో నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అన్ని నిర్ణయాలు సంస్థ విధివిధానాలు, నిబంధనల ప్రకారమే స్వతంత్రంగా తీసుకుంటారనీ, రాజకీయ జోక్యానికి అవకాశం లేదని స్పష్టం చేశారు. నైని కోల్ బ్లాక్ టెండర్లలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బామ్మర్ది సుజన్‌రెడ్డికి చెందిన శోధా కన్‌స్ట్రక్షన్ ప్రయివేట్ లిమిటెడ్‌కు సంబంధం ఉందని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో డీజిల్ సరఫరాను కాంట్రాక్టర్లకే అప్పగించడం ద్వారా మరో కుంభకోణా నికి తెరలేపారన్న హరీశ్ రావు ఆరోపణలను ఆయన ఖండించారు. డీజిల్ సరఫరా విధానంలో మార్పులు కూడా తమ హయాంలో జరగలేదనీ, 2022లోనే అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఈ విధానం అమలుల్లోకి వచ్చిందని తెలిపారు. జీఎస్టీ విధానంలో వచ్చిన మార్పులు, డీజిల్ దొంగతనాలు నివారించడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా కాంట్రాక్ట్ విధానంలో ఈ పద్ధతే అమల్లో ఉందని భట్టి తెలిపారు.

కాంట్రాక్ట్ ఇచ్చేటప్పుడు సైట్ విజిట్ అనేది మేం పెట్టిన కొత్త నిబంధన కాదన్నారు. 2018, 2021, 2023లో కోలిండియా అనుబంధ సంస్థ అయిన సెంట్రల్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ (సీఎంపీడీఐఎల్ ) రూపొందించిన సింగరేణి టెండర్ డాక్యుమెంట్‌లోనే ఉందని స్పష్టం చేశారు. అలాగే ఇతర కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్ఎండీసీ, ఐఐటీ, ఐఐఎం, ఫైనాన్స్ విభాగం, డిఫెన్స్ విభాగం, గుజరాత్‌లోని ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర చాలా కంపెనీల్లో చాలా ఏండ్లుగా అమల్లో ఉందని గుర్తు చేశారు. సీఎంపీడీఐఎల్ నిబంధన మేరకే సింగరేణి సంస్థ 2018 నుంచి ఈ నిబంధనను పాటిస్తూ వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా పొందుపర్చారన్నది పూర్తి అవాస్తవమని పేర్కొన్నారు. ఇదే విధానాన్ని దేశవ్యాప్తంగా అనేక సంస్థలు అమలు చేస్తున్నాయని వివరించారు.

## వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

తనపై చేసిన ఆరోపణలు చేసిన పత్రిక వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలని భట్టి డిమాండ్ చేశారు. లేనట్లయితే ఆ రాతలు వ్యక్తిత్వ హననం జరిగినవిగా భావించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సింగరేణిలో పనిచేస్తున్న దాదాపు 42 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 30 వేల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వస్తున్న కథనాలు తనను ఆవేదనకు గురిచేశాయన్నారు. 40 ఏండ్లుగా రాజకీయాల్లో విలువలు కలిగి ఉన్న నా వ్యక్తిత్వంపై దాడి చేయడం బాదించిందని పేర్కొన్నారు. తప్పుడు రాతలతో సంస్థలోని కార్మికులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. ”సింగరేణి తెలంగాణ ప్రజల ఆస్తి. దీనిపై వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం బురదజల్లడం రాష్ట్రానికి నష్టం చేస్తుంది” అని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల కష్టాన్ని వారి చెమటని స్వయంగా చూశాననీ, గద్దలను, రాబందులను, పెద్దలను వాలనివ్వనని భట్టి అన్నారు. సంస్థను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

**(మొదటి పేజీ తరువాయి)**

లోపల ఉన్న వారి పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతోంది. మంటలను అదుపులోకి తెచ్చేందుకు రెస్క్యూ టీం శనివారం రాత్రి కూడా సహాయక చర్యలు కొనసాగించింది. రాత్రి 10 గంటల వరకు మంటలు అదుపులోకి వచ్చినా దట్టమైన పొగ కమ్ముకోవడంతో సిబ్బందికి లోపలికి వెళ్లడం ఇబ్బందిగా మారింది. అబిడ్స్ జీపీఓ నుంచి నాంపల్లి వెళ్లే దారిలో నాలుగు అంతస్తుల్లో సాయి విశ్వాస్ చాంబర్స్, ఫర్నీచర్ క్రిస్టల్, ఫర్నీచర్ క్యసిల్, శుభ్ ఫర్నీచర్స్ పేర్లతో దుకాణాలున్నాయి. సెల్లార్‌ను గోదాంగా ఉపయోగిస్తున్నారు. గోదాంలో అట్టలు, చెక్కలతో చేసిన ఫర్నీచర్, ఫోమ్, థర్మకోల్, ప్లాస్టిక్‌తోపాటు ఇతర సామగ్రిని నిల్వ చేశారు. అయితే శనివారం మధ్యాహ్నం 12:30గంటల సమయంలో సెల్లార్ నుంచి పొగలు వచ్చాయి. అది ఎవరూ గుర్తించకపోవడంతోపాటు క్షణాల వ్యవధిలో భారీగా మంటలు వ్యాపించాయి.

దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఆందోళనకు గురైన స్థానికులు, సమీప దుకాణాదారులు వెంటనే అబిడ్స్ పోలీసులతోపాటు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అప్పటికే గ్రౌండ్‌ఫ్లోర్ నుంచి నాలుగు అంతస్తుల వరకు మంటలు వ్యాపించడంతో ఆ ప్రాంతం అంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. సెల్లార్ అంతా ఫర్నీచర్ ఉండటంతో రెస్క్యూ ఆపరేషన్‌కు కష్టంగా మారింది. దాంతో బాహుబలి క్రెయిన్, జేసీబీతో ఫర్నీచర్ తొలగించారు. పై అంతస్తు వరకు బాహుబలి క్రెయిన్ సహాయంతో సుత్తెలతో అద్దాలను పగలగొట్టారు. ఇరుకైన గల్లిలో పెద్దఎత్తున మంటలు, దట్టమైన పొగ వ్యాపిచడంతో ఎన్‌డీఆర్ఎఫ్, సివిల్, ర్యాపిడ్ యాక్షన్ బృందాలను రంగంలోకి దించారు. సెల్లార్‌లో ఓ పక్క నీరు చేరడంతో ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చిన్న బోట్ ద్వారా లోనికి వెళ్లాల్సి వచ్చింది. రోబోను సైతం లోనికి పంపించి కెమెరాల సహాయంతో సెల్లార్‌లోని పరిస్థితిని అంచనా



వేసేందుకు అధికారులు ప్రయత్నించారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు 16 ఫైరింజన్లు ఉపయోగించారు. దాదాపు ఐదు వరకు అంబులెన్స్‌లు, వాటర్‌బోర్డు నుంచి 20 నీళ్ల ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు.

**పిల్లలను సురక్షితంగా కాపాడేందుకు..**

దుకాణం యజమాని సంతోష్ కొన్నేండ్లుగా ఫర్నీచర్ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అందులో వాచ్‌మెన్‌గా మాల్‌కు చెందిన యాదయ్య, లక్ష్మి దంతులుంటున్నారు. వారికి అఖిల్(7), ప్రణిత(11) సంతానం. అంతా కలిసి సెల్లార్‌లోనే నివాసముంటున్నారు. పిల్లలు స్థానిక స్కూల్‌లో చదువుతున్నారు. నాంపల్లి సుభాన్‌పూర్‌కు చెందిన మాహ్మద్ హుస్సేన్ ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు. శాస్త్రీపురానికి చెందిన సయ్యద్ ఆబీద్ కూడా శుభ్ ఫర్నీచర్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. అయితే ఉదయమే యాదయ్య, లక్ష్మి దంపతులు పిల్లలను సెల్లార్‌లో ఆడుకోవాలని చెప్పి బయటకు వెళ్లారు.

మధ్యాహ్నం సెల్లార్ నుంచి దట్టమైన పొగ వస్తుండటాన్ని గమనించిన సయ్యద్ ఆబీద్, మహ్మద్ హుస్సేన్, మేనేజర్ ఇంతియాజ్ పిల్లలను రక్షించేందుకు లోపలికి వెళ్లారు. అప్పటికే మంటలు, పొగ కమ్ముకోవడంతో వారు కూడా అందులో చిక్కుపోయారు. వారితో పాటు స్వీపర్‌గా పనిచేస్తున్న 60 ఏండ్ల వృద్ధురాలు సైతం సెల్లార్‌లో ఉండిపోయినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. బాహుబలి క్రెయిన్, జేసీబీల సహాయంతో భవనంలో ఉన్న వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమించింది. గాలి పీల్చుకోవడం ఇబ్బందిగా మారడంతో లోపల ఉన్న వారి పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.

**పరిశీలించిన హైదరాబాద్ సిపీ వీసీ సజ్జనార్**

ప్రమాద సమయంలో నాలుగు అంతస్తుల భవనంలో మొత్తం ఆరుగురు వ్యక్తులు చిక్కుకున్నట్టు అనుమానిస్తున్నామని హైదరాబాద్ సిపీ వీసీ సజ్జనార్ తెలిపారు. విషయం తెలుసుకున్న సీపీ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అధికారులతో కలిసి ప్రమాద తీవ్రతను పరిశీలించారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో అందులో ఉన్న వారు బయటకు రాలేకపోతున్నారని తెలిపారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ విచారిస్తామని తెలిపారు. బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగర ప్రజలకు పలు సూచనలు చేశారు. తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా వాహనాలను దారి మళ్లించామన్నారు. మంటలను అదుపు చేయడం చాలా కష్టంగా మారిందని ఫైర్ డీజీ విక్రమ్‌సింగ్ మాన్ తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్‌లో స్టాక్‌ను నిల్వ చేశారన్నారు. లోపలికి వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు అడ్డంకులు ఏర్పడ్డాయన్నారు. మంటలు అదుపులోకి వచ్చినా దట్టమైన పొగ ఉండటం వల్ల సెల్లార్‌లోకి వెళ్లలేకపోతున్నామన్నారు. సెల్లార్‌లోకి వెళ్లేందుకు మరో రెండు గంటలు పట్టొచ్చని చెప్పారు. ఇప్పటికే సెల్లార్‌లోని ఫర్నీచర్ మొత్తాన్ని రెస్క్యూ టీమ్ ధ్వంసం చేసిందన్నారు. సంఘటన స్థలంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందనా, జాయింట్ సీపీ డేవీస్ జోయేల్, డీసీపీ, హైదరాబాద్ డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకట్, జీహెచ్ఎంసీ ఏంహెచ్‌వో డాక్టర్ పద్మజాతోపాటు హైడ్రా, జీహెచ్ఎంసీ, జలమండలి, వైద్య, విద్యుత్‌శాఖ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.

# 27న దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

**వారానికి 5 రోజుల పనిదినాలు అమలు చేయాలని డిమాండ్**

**ప్రభుత్వ ఆమోదంలో జాప్యమే సమ్మెకు కారణం**

**9 సంఘాల ఐక్యవేదిక యూఎఫ్ బీఐ సమ్మెకు పిలుపు**

**జనవరి24 (జర్నలిస్ట్ వార్త):**

వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశంలోని ప్రధాన బ్యాంకు ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. జనవరి 27న దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్లు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్ బీయూ) ప్రకటించింది. ఈ సమ్మె కారణంగా ఆ రోజు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. ఎన్డీటీవీ ప్రాఫిట్ నివేదిక ప్రకారం, జనవరి 26 అర్ధరాత్రి నుంచి 27 అర్ధరాత్రి వరకు ఈ సమ్మె జరగనుంది.తొమ్మిది బ్యాంకు సంఘాల ఉమ్మడి వేదిక అయిన యూఎఫ్ బీయూ, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ యాక్ట్-1947 ప్రకారం ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), చీఫ్ లేబర్ కమిషనర్, ఆర్థిక సేవల విభాగానికి (డీఎఫ్ఎస్) సమ్మె నోటీసు పంపింది. బ్యాంకులకు అన్ని శనివారాలు సెలవు దినాలుగా ప్రకటించి, 5 రోజుల పని విధానాన్ని అమలు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అని యూనియన్లు స్పష్టం చేశాయి.

ఇప్పటికే ఈ ప్రతిపాదనకు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ఆమోదం తెలిపి ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని యూనియన్లు గుర్తుచేశాయి. 2023 డిసెంబర్ 7న ఐబీఏ, యూఎఫ్ బీయూ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం మేరకు ఈ సిఫార్సు జరిగింది. అయితే, ప్రభుత్వ నియంత్రణ సంస్థల నుంచి తుది ఆమోదం లభించడంలో తొమ్మిది నెలలకు పైగా జాప్యం జరుగుతోందని, ఈ కారణంగానే తాము మళ్లీ ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని యూఎఫ్ బీయూ తెలిపింది. పనిదినాలు తగ్గినా, మొత్తం పనిగంటలు తగ్గకుండా ఉండేందుకు రోజువారీ పనివేళలను 40 నిమిషాలు పెంచేందుకు కూడా యూనియన్లు అంగీకరించడం గమనార్హం.

# భారత్ సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌గా ఎదుగుతోంది

**(మొదటి పేజీ తరువాయి)**

అవకాశాలను సృష్టిస్తోందని ఆయన అన్నారు. యువతకు ఉద్యోగం లక్ష్యంగా ప్రారంభమైన రోజ్‌గార్ మేళా కార్యక్రమం ఇప్పుడు ఒక సంస్థగా రూపాంతరం చెందిందని అన్నారు. రోజ్‌గార్ వేదికగా దేశంలోని లక్షలాది మంది ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు.యువతకు సరైన, సమగ్ర అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని చెప్పారు. వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని, దీని ద్వారా దేశ, విదేశాల్లో ఉన్న భారతీయ యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

**(మొదటి పేజీ తరువాయి)**

జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బ్జడెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బ్జడెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బ్జడెట్ 2026-27ను ఉభయసభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వరుసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బ్జడెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు. కాగా, గత శీతాకాల సమావేశాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం తీసుకువచ్చిన వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) చట్టంపైనా పార్లమెంటులో చర్చ జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం చేసిన ఈ మార్పుపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించడంతో పాటు కొత్త చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త ప్రచారం సాగిస్తోంది.

# నైనీ బ్లాక్ టెండర్లపై విచారణ

**(మొదటి పేజీ తరువాయి)**

ఆరా తీస్తోంది. సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్ వద్ద ఈ బృందం వివరాలు సేకరిస్తోంది. శుక్రవారం రాత్రి 7 గంటలపాటు విచారణ జరిపింది. నేడు మరోసారి విచారణ చేపట్టిన బృందం వచ్చే సోమవారం తన నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. కాగా.. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్‌లో సైట్ విజిట్ సర్టిఫికేట్ నిబంధన సరికాదని, అక్రమాలకు దారి తీస్తుందని ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో టెండర్లను రద్దు చేయాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించిన విషయం తెలిసిందే. అలాగే నైనీ బొగ్గు బ్లాక్ టెండర్లలో అవినీతి ఆరోపణలపై స్పందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.. సమగ్ర విచారణకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేశారు. ఇద్దరు సభ్యులతో కూడిన కేంద్ర బొగ్గు శాఖ అధికారుల బృందంతో కమిటీ ఏర్పాటైంది. బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, బొగ్గు శాఖ టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఈ బృందం సింగరేణిలో పర్యటించి.. నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దుకు గల కారణాలపై విచారణ జరిపి, ఆ నివేదికను మూడు రోజుల్లో అందజేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.

# శ్రీశైలం ప్రాజెక్టుకు డ్రిప్ నిధులు

**(మొదటి పేజీ తరువాయి)**

నిర్ణయించినట్టు తెలిసింది. గడిచినకొన్నేళ్ళుగా ఈ ప్రతిపాదన డ్యాం సెఫ్టీ రివ్యూ ప్యానల్ (డీడీఆర్పీ) వద్ద పెండింగ్లో ఉంది. రాష్ట్ర పునర్విభజన అనంతరం 31 ప్రాజెక్టులను డ్రిప్ లో చేర్చాలనిజలవనరుల శాఖ కేంద్రానికి నివేదికలు అందించింది.2022లో దేశంలోని అనేక ప్రాజెక్టులను డ్రిప్ -1లోచేర్చినా రాష్ట్రంలోని ప్రాజెక్టులకు చోటు దక్కలేదు.డ్రిప్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రాజెక్టు పనులులేవని డీడీఆర్పీ వాటన్నిటినీ తిరస్కరించింది.శ్రీశైలంతో పాటు ధవళేశ్వరంను డ్రిప్ -2 లో చేర్చేవిషయంపై ఇపుడు కేంద్రం నుంచి సానుకూలతవ్యక్తమైనట్టు సమాచారం. ప్లంజ్ పూల్ను పూర్తిగాకాంక్రీట్తో పూడ్చాలని ఎప్పటినుంచో ప్రతిపాదనఉంది. డ్రిప్ నిధులతో ప్లంజ్ పూల్ పనులు చేపట్టేందుకరూ.700 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించినడీపీఆర్ సీడబ్ల్యూసీ పరిశీలనలో ఉంది. అంతేకాకుండా జలాశయం ఇతర మరమ్మతుల కోసంమరో రూ.90 కోట్ల అంచనా వ్యయ ప్రతిపాదనలుకూడా అమలుకు నోచుకోలేదు. శ్రీశైలంను డ్రిప్ -2లోచేర్చటంతో పాటు నిధులను కూడా విడుదలకు కూడాకేంద్రం ఆమోదం తెలపనున్నట్టు తెలిసింది.ప్రాజెక్టుల పటిష్టత, ఆధునికతల కోసం ప్రపంచబ్యాంక్ అందించే నిధులతో దేశవ్యాప్తంగా కేంద్రజలవనరుల మంత్రిత్వశాఖ డ్రిప్ పథకాన్ని అమలుచేస్తోంది. దేశవ్యాప్తంగాఎంపిక చేసిన డ్యాంలనుడ్రిప్-2లో చేర్చటంలోభాగంగా డ్యాం భద్రతాకమిటీ రెండేళ్ల క్రితం ఏపీలోని శ్రీశైలం, ధవళేశ్వరంప్రాజెక్టులను క్షేత్రస్థాయిలోపరిశీలించింది.

## బండి సంజయ్, ధర్మపురి అరవింద్‌లకు కేటీఆర్ లీగల్ నోటీసులు

**(మొదటి పేజీ తరువాయి)**

చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, ప్రజల్లో తనపై ఉన్న నమ్మకాన్ని సడలించేలా ఆరోపణలు చేశారని పేర్కొన్నారు.ఇరువురు నేతలు కూడా బాధ్యతాయుతమైన పదవుల్లో ఉండి తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ అన్నారు. తనకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరాధార ఆరోపణలు చేశారని, ఉద్దేశపూర్వకంగానే వారు తనను లక్ష్యంగా చేసుకుని మాట్లాడారని కేటీఆర్ తెలిపారు. రాజకీయాల కోసం వారు దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్, అరవింద్‌లకు తన న్యాయవాదులతో నోటీసులను పంపించారు.ఫోన్ ట్యాపింగ్ ద్వారా కేటీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు ఆర్జించిందని, సెలబ్రిటీల ఫోన్లను ట్యాప్ చేశారని బండి సంజయ్ నిన్న ఆరోపించారు. అయితే ఈ వ్యాఖ్యలను కేటీఆర్ కొట్టిపారేశారు. ఇప్పటికే బండి సంజయ్‌పై సిటీ సివిల్ కోర్టులో పరువు నష్టం దావా నడుస్తోందని, అయినప్పటికీ ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడమేమిటని ప్రశ్నించారు. ధర్మపురి అరవింద్ తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని ఆయనకు పంపిన నోటీసుల్లో పేర్కొన్నారు. డ్రగ్స్ సేవిస్తున్నారని, సరఫరా చేస్తున్నారని చెప్పడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

# ఇద్దరూ దోపిడీ దారులే

**(మొదటి పేజీ తరువాయి)**

కేటాయింపు, జరిగిన దోపిడీపై శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణలో జరిగిన దోపిడీపై మాట్లాడుతుంటే.. గుజరాత్‌ను ఎందుకు లాగుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో మంత్రులు, దళారులు దోచుకుంటున్నారని ఆరోపించారు. అందుకే ఒకరి అవినీతిపై మరొకరు ఆరోపణలు చేసుకుంటున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అవినీతిపై బీఆర్ఎస్ లేఖ రాస్తే.. బీఆర్ఎస్ అవినీతిపై కూడా విచారణ జరుపుదామా? అని మంత్రి మల్లు భట్టి విక్రమార్క చెబుతున్నారని ప్రస్తావించారు. సింగరేణిలో రెండు పార్టీలు దోచుకున్న దోపిడీపై విచారణ జరపాలని బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికులు పోరాటాలు చేసి తెలంగాణ సాధించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రంలో కంటే ఎక్కువ గనుల దోపిడీ ఇప్పుడు కొనసాగుతోందని ఆరోపించారు. సింగరేణిపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో టైంపాస్ చేయొద్దని బండి అన్నారు. సింగరేణి అవకతవకలకు సంబంధించిన రికార్డులన్నీ వెంటనే సీజ్ చేయాలని కోరారు. లేనిపక్షంలో అవి తారుమారు చేసే ప్రమాదముందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సింగరేణికి చెల్లించాల్సిన రూ.42 వేల కోట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'కేసీఆర్ పాలనలో సింగరేణిని దోచుకుంది ఆయన కుటుంబమేనని బండి సంజయ్ విమర్శించారు. ఆ సొమ్ముతోనే బీఆర్ఎస్‌ను ఇన్నాళ్లూ నడిపించారని ఆరోపించారు. 'రూ.42 వేల కోట్ల సింగరేణి సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం దోచుకుంది. సింగరేణిని అప్పుల పాల్జేసింది. ఎన్నికలకు ముందు సింగరేణిని లాభాల్లోకి తెస్తామంటారు. అధికారంలోకి వచ్చాక ఆ సొమ్మునంతా దారి మళ్లించడం పరిపాటైంది. సింగరేణి ప్రజలు, కార్మికులు రెండు పార్టీల తీరును చూసి అసహ్యించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ తోడు దొంగలే. మా బాగోతం మీరు బయటపెడితే.. మీ బాగోతం మేం బయటపెడతామంటూ మాట్లాడుకుంటున్నారు. మరో వారం రోజుల తర్వాత సింగరేణి బాగోతాన్ని దారి మళ్లించేందుకు మరో అంశాన్ని తెరపైకి తెస్తారు. మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంటుంది' అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌ను సాక్షిగా పిలిచామని మంత్రులు చెబుతున్నారు.

## బయ్యారంను నియోజకవర్గ కేంద్రంగా చేయాలి.

**జిల్లా మాజీ చైర్ పర్సన్ అంగోత్ బిందు. - తహశీల్దార్ కు మెమోరాండం**



**బయ్యారం/జనవరి 23,(జర్నలిస్ట్ వార్త);** బయ్యారం మండలం ను నియోజకవర్గం కేంద్రంగా చేయాలని మహబూబాద్ జిల్లా మాజీ జడ్పీ చైర్పర్సన్ అంగోత్ బిందు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కోదండరామ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గ సాధన సమితి కన్వీనర్ చందర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడుతూ, గార్ల, బయ్యారం ,గంగారం, కొత్తగూడ, మండలాలను కలుపుతూ బయ్యారం మండల కేంద్రంను నియోజకవర్గంగా ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు సమీప భవిష్యత్తులో పునర్విభజన జరిగితే బయ్యారంను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ మూల మధుకర్ రెడ్డి, మాజీలు ఎంపీపీ గుగులోతు కిషన్ నాయక్, ఎంపీటీసీ సనప సోమేష్, ఎనుగుల ఐలయ్య, తుమ్మల శ్రీనివాస్,మండలంలో ని గ్రామ సర్పంచులు, జగ్గు తండా ఉప సర్పంచ్ గుంజ వీరస్వామి, వార్డ్ మెంబర్లు సాధన కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.అనంతరం నాయకులు మండల తాహశీల్దార్ నాగరాజుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు నియోజకవర్గ ఏర్పాటుకు సహకరించాలని నాయకులు కోరారు.

## ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం.




**బయ్యారం/జనవరి 23,(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ బి.శోభన్ బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శనివారం నేషనల్ ఓటర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బాగంగా విద్యార్థుల ద్వారా జాతీయ ఓటర్ దినోత్సవం ప్రతిజ్ఞను చేపించి,అనంతరం విద్యార్థులచే యువర్ ఓట్ యువర్ రైట్,ఓట్ ఫర్ ఫ్యూచర్ నినాదాలు చేపించి ఓటు విలువ గురించి వివరించినట్టు శోభన్ బాబు తెలిపారు.ఈ సందర్బంగా ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగంలో కుల,మత,వర్గ, వర్ణ,ప్రాంతీయ వివక్షత లేకుండా అందరికీ 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు భారత రాజ్యాంగం కల్పించిదన్నారు.ఈ వార్డెన్ లాలయ్య,ఫీజికల్ డైరెక్టర్ వాలు,ఉపాధ్యాయులు హీరాసింగ్,శ్రీను,వీరు,రవి, కృష్ణవేణి,కాంతారావు,తులసి దాస్, అంజయ్య,వెంకటేశ్వర్లు,విద్యార్థులు పాల్గొన్నారు.ం


## ఘనంగా జాగృతి ప్రజా వైద్యశాల డాక్టర్ మోహన్ జన్మ దిన వేడుకలు



**వైరా/ జనవరి 24(జర్నలిస్ట్ వార్త);** గత కొన్ని సంవత్సరాల నుండి వైరా పట్టణంలో పేద ప్రజలకు నిస్వార్థ వైద్యం అందిస్తున్న డాక్టర్ మోహన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు ఈ వేడుకల్లో వైరా పట్టణ రాజకీయ నాయకులు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు ఈ సందర్భంలో డాక్టర్ తన లక్ష్యాన్ని పేద ప్రజలకు ఖచ్చితమైన వైద్యం అందించాలని లక్ష్యంతో ముందుకు వెళ్తున్న ఈ సందర్భంలో వికలాంగులకు ఎటువంటి ఫీజు లేకుండా వైద్యం అందించాలని లక్ష్యం మన్నారు.

## మేడారం జాతరు భారీగా తరలుతున్న జనం

**50 క ఓట్లతో భక్తుల కోసం స్నానఘట్టాల ఏర్పాటు**



ములుగు,**జనవరి24 (జర్నలిస్ట్ వార్త):** మేడారం జాతరలో సందడి నెలకొంది. భారీగా ప్రజలు తరలి వస్తున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా రూ. 50 కోట్ల నిధులతో స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. మహా జాతరకు మరోమూడు రోజుల వ్యవధే ఉంది. ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున మేడారం తరలివస్తు న్నారు. మహా జాతరను తలపించేలా ప్రధాన కూడళ్లు, గద్దెలు, జంపన్నవాగు స్నాన ఘట్టాలు, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, విడిది చేస్తే అటవీ ప్రాంతాల్లో భక్తజనంతో రద్దీగా మారాయి. 3 లక్షల మందికి పైగా భక్తులు ప్రైవేటు, ఆర్టీసీ వాహనాల్లో తరలివచ్చారు. దీంతో రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. సమ్మక్క, సారలమ్మలకు ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన భక్తులతో మేడారం పరిసరాలన్నీ జనసంద్రంగా మారాయి. వనదేవతలకు మొక్కుల్లో భాగంగా భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా ఎత్తు బంగారం(బెల్లం) నెత్తిన మొస్తూ కాలినడకన దేవస్థానంలోని తల్లుల గద్దెలకు చేరుకున్నారు. ఆదివాసీల ఆచార సంప్రదాయాలలో చీరె, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, బెల్లం, ఒడిబియ్యం, యాట మొక్కులను చెల్లించుకుని తల్లీ సల్లంగా చూడు.. మహా జాతరకు వస్తాం అని వేడుకున్నారు.

# ఫోటోగ్రఫీ పోటీలో బయ్యారం ఫోటోగ్రాఫర్ సందీప్ కు మొదటి బహుమతి.




**బయ్యారం/జనవరి 24 (జర్ణలిస్ట్ వార్త);**
ప్రముఖ ఆర్ట్ ఫోటో గ్రాఫర్ పిల్లి సతీష్ జ్ఞాపకార్థం లంబాడా జీవన విధానంపై జనవరి 22,23 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించారు.మన తెలంగాణ నుండి కాకుండా ఇతర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో ఫోటో గ్రాఫర్లు పాల్గొన్న ఈ పోటిల్లో బయ్యారం మండలానికి చెందిన సీనియర్ ఫోటో గ్రాఫర్ కేస సందీప్ మొదటి బహుమతి సాధించారు.ఆంధ్రప్రదేశ్ చీరాలకు చెందిన అరవింద్ రెండవ బహుమతి,సూర్యాపేట జిల్లా చెందిన శ్రీనివాస్ మూడవ బహుతి సాదించారు.ఈ కార్యక్రమంలో ఫోటోగ్రఫీ మహబూబాబాద్ జిల్లా అద్యక్షులు తోట సుభాష్,గౌరవ అద్యక్షులు దుంపేటి లక్ష్మణ్,ప్రధాన కార్యదర్శి కేస సందీప్,కోశాదికారి కడుదుల రవి,మానుకోట జిల్లా కుటుంబ భరోస ఇంచార్జ్ సింగంశెట్టి బాబురావు,మానుకోట పట్టణ అధ్యక్షులు షరీప్,కార్యదర్శి వంశీ,కోశాదికారి రఘు,వర్క్ షాప్ నిర్వాహకులు ఎరబోయిన.శంకర,డప్పు యాని, వర్క్ షాప్ న్యాయనిర్ణేతలు శ్రీనివాసచారి, నాగు, మెంటర్ సునీల్,ఇతర ఫోటో గ్రాఫర్లు పాల్గొన్నారు.



ఫోటో గ్రాఫర్ సందీప్

# మన ఆధ్యాత్మికతను ప్రపంచానికి చాటారు.

**సత్తుపల్లి/జనవరి 24(జర్నలిస్ట్ వార్త):**
మన మూర్తి త్రయం (రామకృష్ణ పరమహంస, శ్రీ శారదామాత, స్వామి వివేకానంద )
భారత ఆధ్యాతికతను ప్రపంచానికి పరిచయం చేశరని స్థానిక శ్రీ రామకృష్ణ , వివేకానంద సేవాసమితి నిర్వాహకులు
చీకటి శ్రీనివాసరావు, పసుపులేటి నాగే శ్వరరావులు అన్నారు. ఆ సంస్థల ఆధ్వర్యంలో మూర్తి త్రయం అనే పుస్తకాలను ఇటీవల విద్యార్థులకు అందజేసికొద్దిరోజుల తరువాత దానిపై ప్రతిభా పోటీలు నిర్వహించారు. శనివారం విశ్వశాంతిలో జరిగిన బహుమతుల అందజేత కార్యక్రమమం లో వారు మాట్లాడారు. శ్రీ రామకృష్ణ పరమహంస
ఆధునిక భారత ఆధ్యాత్మిక గురువు.భక్తి, జ్ఞానం, కర్మ అనే మార్గాల ద్వారా దైవానుభూతి సాధ్యమే అని తన జీవితం ద్వారా చూపించారు.

**ఆదర్శ మాతృత్వం . శారదామాత**

శ్రీ రామకృష్ణ పరమహంస వారి ధర్మపత్ని. ఆధ్యాత్మిక



తల్లి.కరుణ, సహనం, మాతృత్వానికి ప్రతీక.

**స్వామి వివేకానంద..వీరు**

శ్రీ రామకృష్ణ పరమహంస శిష్యుడు. భారత యువతకు మహా ప్రేరణ.
భారత ఆధ్యాత్మికతను ప్రపంచానికి పరిచయం చేసిన మహనీయుడు అని వారు పేర్కొన్నారు.

**విశ్వశాంతి విజేతలు వీరే**

ఈ పోటీలలో విశ్వశాంతి విద్యాలయానికి చెందిన



రోహన్, బలసంతోశ్, శ్రీరామ్, హర్ష, ప్రజ్వలిత, పాతీ మున్నీసా, మార్ధవసాయి, దీపిక, ప్రవల్లిక, యశ్వంత్ విష్ణు, వైష్ణవి, హేమ చంద్ర, రఘుదీప్, కౌషర్ విజేతలుగా నిలిచారు.

# జర్నలిస్టుల బతుకులు మార్చేది ఎవరు?

ప్రభుత్వానికిప్రజలకు వారధిగా నిలిచే జర్నలిస్టుల దుస్థితి
ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులు నేడు తీవ్ర అనిశ్చితి, ఆర్థిక అస్థిరత, సామాజిక నిర్లక్ష్యంతో జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులే తమ సమస్యల విషయంలో మాత్రం నిర్లక్ష్యానికి గురవుతున్నారు.

ప్రభుత్వాలు మారుతున్నాయిడ పాలకులు మారుతున్నారుడ కానీ జర్నలిస్టుల స్థితిగతుల్లో మాత్రం ఎలాంటి మార్పు రావడం లేదు. ఎన్నికల సమయంలో జర్నలిస్టులకు అనేక హామీలు ఇస్తూ, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను మరచిపోవడం పరిపాటిగా మారింది. జర్నలిస్టుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వాలు, అమలులో మాత్రం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాయి.

ప్రాణాలకు తెగించి వార్తల కోసం తిరిగే జర్నలిస్టులు, ప్రమాదాలకు గురయ్యే పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. అయినా జర్నలిస్టులు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ అనారోగ్యానికి గురైతే కనీస హెల్త్ కార్డు కూడా ఇవ్వలేని పరిస్థితి కొనసాగుతోంది. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, పెన్షన్ వంటి మౌలిక సదుపాయాలు జర్నలిస్టులకు



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ లెనిన్
9908401581

ఇప్పటికీ అందని ద్రాక్షగానే ఉన్నాయి.
నిజం చెప్పినందుకు వేధింపులు, బెదిరింపులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వాలు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారుతోంది. ప్రజల కోసం ప్రశ్నలు వేసే జర్నలిస్టులు, తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే మాత్రం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

ఇలాంటి పరిస్థితుల్లో జర్నలిస్టులు ఉద్యమిస్తే తప్ప వారి సమస్యలు పరిష్కారం కావు అన్న భావన బలపడుతోంది. ఐక్యంగా పోరాడినప్పుడే తమ హక్కులు సాధ్యమవుతాయని జర్నలిస్టులు గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు స్వచ్ఛందంగా స్పందించని పరిస్థితుల్లో ఉద్యమమే మార్గంగా మిగులుతోంది.

జర్నలిస్టులకు కనీస అవసరాలు కల్పించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలి. హెల్త్ కార్డులు, బీమా పథకాలు, గౌరవ వేతనం, నివాస సౌకర్యాలు, భద్రత వంటి అంశాలపై స్పష్టమైన విధానాలు రూపొందించాలి. జర్నలిస్టుల సంక్షేమమే ప్రజాస్వామ్య బలోపేతానికి పునాది అనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రజల గొంతుకగా నిలిచే జర్నలిస్టుల బతుకులు మారకపోతే, ప్రజాస్వామ్యమే బలహీనమవుతుంది. జర్నలిస్టుల భవిష్యత్తును కాపాడే బాధ్యత ప్రభుత్వాలదే.
ఇప్పుడు ప్రశ్న ఒక్కటే
జర్నలిస్టుల బతుకులు మార్చేది ఎవరు?

## తండ్రి కెసిఆర్ ఫోన్లను కూడా ట్యాప్ చేసిన ఘనుడు

### కెటిఆర్‌పై విరుచుకు పడ్డ మంత్రి వివేక్

మంచిర్యాల,**జనవరి24 (జర్నలిస్ట్ వార్త):** :సొంత చెల్లె కవిత, బావ హరీశ్ రావు, తండ్రి కేసీఆర్ ఫోన్లను కూడా కేటీఆర్ ట్యాపింగ్ చేయించారని మంత్రి వివేక్ ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఫోన్ ట్యాపింగ్ చేశారని మండిపడ్డారు. చెన్నూరు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి శంకుస్థాపన చేశారు. సుమారు కోటి 25 లక్షల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడిన ఆయన.. కేటీఆర్,కేసీఆర్ రిటైర్డ్ పోలీస్ అధికారులతో ఫోన్ ట్యాపింగ్ లకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ కుంభకోణాల్లో కోట్ల రూపాయల దండుకొని పేద ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఎనికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. చెన్నూరు మున్సిపాలిటీనీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు వివేక్. సుమారు 500 కోట్ల నిధులతో మున్సిపాలిటీలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో కోల్ బ్లాక్ టెండర్ లలో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వారు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవన్నారు.



టెండర్ ప్రక్రియ చాలా పారదర్శకంగా జరుగుతుందన్నారు. కావాలనే కేటీఆర్, హరీశ్ రావులు ప్రభుత్వం పైన బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మంత్రి వివేక్ మండిపడ్డారు. కొత్త మైన్స్ వస్తేనే సింగరేణికి మనుగడ ఉంటుంది.. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. త్వరలో రామకృష్ణ పూర్ లో కొత్త మైన్ రాబోతుందని ఆ ప్రాంతానికి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు.

## తల్లాడ ఎంపీడీవోగా ఏ శ్రీధర్ రాజు బాధ్యతలు స్వీకరణ

### అందరి సహకారంతో అభివృద్ధికై సహకరిస్తా



**తల్లాడ /జనవరి 24(జర్నలిస్ట్ వార్త);** మండల పరిధిలోనూతన ఎంపీడీవో గా ఏ శ్రీధర్ రాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు,ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది సహకారంతో మండలాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తానని. అందుకు నా శాయశక్తుల కృషి చేస్తానని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకునేందుకు ప్రతి పౌరుడు అవగాహన కలిగి ఉండాలని, అధికారులతో పని చేయించుకోవడం తమ హక్కుగా భావించాలని ప్రజలకు సూచించారు.

## వైరా మున్సిపాలిటీ ఎన్నికలకు పోటీకి సిద్ధంగా గ్రామీణ వైద్యుడు దాసు



**వైరా/ జనవరి 24(జర్నలిస్ట్ వార్త);** వైరా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గండగల పాడు పదో వార్డు తరఫున ఆర్.ఎం.పి వైద్యుడు దాసు బి.ఆర్.ఎస్ పార్టీ అవకాశం ఇస్తే పోటీకి సిద్ధంగా ఉన్నానాని తెలిపాడు.

## రెండు లక్షలు సహాయం చేసిన వీరారెడ్డి, వెంకట కృష్ణారెడ్డి



**తల్లాడ /జనవరి24(జర్నలిస్ట్ వార్త);** వైరా మాజీ వ్యవసాయశాఖ మార్కెట్ చైర్మన్ దుండేటి వీరారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు, తల్లాడ సొసైటీ డైరెక్టర్ దుండేటి వెంకటకృష్ణారెడ్డి వారి సహాయం తో రెండు లక్షల రూపాయలతో హైదరాబాద్ వనస్థలి హస్పటల్ లో తెల్లూరి బాలకృష్ణ సన్నాఫ్ వెంకటేశ్వర్లు కు ఆపరేషన్ చేయించడం జరిగింది.గత 19/01/2026 తారీకు సోమవారం సాయంత్రం బైక్ మీద తల్లాడ నుండి గొల్లగూడెం వెళుతుండగా టిజీ 04 వి 3816 మారుతి సుజుకి కారు బాలకృష్ణను ఢీకొట్టడంతో అక్కడ కిందపడి మోకాలు గట్టిగా రోడ్డు గుద్దుకొని మోకాలి లోపల కండరాలు లెగ్మెట్ రెండు కట్ అయినవి బాలకృష్ణ ను హైదరాబాద్ వనస్థలి హాస్పిటల్ లో శనివారం ఆపరేషన్ చేయించడం జరిగింది. ఆపరేషన్ గాను రెండు లక్షల ఖర్చు అయినవి, ఆక్సిడెంట్ గల కారుపై తల్లాడ పోలీసులు చర్య తీసుకొని తమకు న్యాయం చేయగలరని కోరుచున్నారు బాధితుడి బంధువులు

# రవన్న కు ఘన నివాళి



**ఖమ్మం బ్యూరో/జనవరి 24(జర్నలిస్ట్ వార్త);** జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో తెలుగుదేశంపార్టీ సీనియర్ నేత పరిటాల రవీంద్ర 21 వ వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా హడ్ హక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్ మాట్లాడుతూ.ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గం నుండి మూడుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించి క్యాబినెట్ మంత్రిగా పనిచేశారని. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో ఆంధ్రప్రదేశ్ లో అనేక సంక్షేమ పథకాలు చంద్రబాబు తో కలిసి పనిచేసిన ముఖ్యులు లో ఒకరని వారు చేసిన సేవలను గురించి కొనియాడారు. వీరితోపాటు పెనుగొండ ఉపేందర్, మేకల సత్యవతి, ఎస్వి రమణ, చల్లగుండ్ల రమేష్, కొలికొండ మురళి, కొల్లుపూర్ణ ధామాల శివ, మద్దినేని శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# అంగన్వాడి టీచర్లు ఆదర్శంగా నిలువాలి..

### ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సక్రమంగా అందించాలి... -ఏసీడీపీఓ రతమ్మ, నవ్యశ్రీ





**తల్లాడ /జనవరి 24(జర్నలిస్ట్ వార్త)!** అంగన్వాడి టీచర్లు ఆదర్శంగా నిలువాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సక్రమంగా అందించాలని ఏసీడీపీఓ రతమ్మ, నవ్యశ్రీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రైతు వేదిక ప్రాంగణంలో అంగనవాడి టీచర్లను వారి డివిజన్ ప్రాజెక్ట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో పిల్లలను వారి విద్యా విధానంలో మెలుకువలు, పిల్లల పోషణకు అవసరమైన ప్రోటీన్స్ పదార్థాలు ఏ విధంగా అమలు చేయాలో అంశాలని తెలుపడం జరిగిందన్నారు.
క్వాలిటీ ఎడ్యుకేషన్, ఎన్ హెచ్ టీఎస్ పోషణ ట్రాకర్ యాప్స్ అప్డేషన్ మొదలైన అంశాల ప్రాజెక్ట్ మీటింగ్ సీడీపీఓ కండక్ట్ చేసారన్నారు .కల్లూరు ప్రాజెక్ట్ పరిధిలో ఒక్కొక్కరు ఒక్కో టాపిక్ పై శిక్షణ ఇచ్చారు. చిన్న తరగతులు పిల్లలు ఎడ్యుకేషన్, మాల్ న్యూట్రిషన్, ఎస్ ఎస్ ఎఫ్ బి, గ్రోత్ చార్ట్,వున్నా 10 మంది సూపర్వైజర్స్, తల్లాడ, కల్లూరు, మండలాల ఏసీడీపీఓ లు , డివిజనమండలం లో
పిల్లల పెరుగుదల కు అవసరమైన అనుబంధ పోషకాహర కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేయడం లో వున్నా అంగన్వాడీ టీచర్స్ తమ పనితీరును మెరుగు పరుచుకొని ప్రభుత్వం లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

## బాలికలు సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలి

### వంగర, ముల్కనూర్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు -జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలు






**భీమదేవరపల్లి/జనవరి24 (జర్నలిస్ట్ వార్త):** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర, ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పీవీ రంగారావు గురుకులంలో జాతీయ బాలికా దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. బాలికలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని, సవాళ్లు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి బాలికల హక్కులు, సమానత్వంపై సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. రత్నగిరి గ్రామంలో సర్పంచ్ వంగ తిరుమల,



పంచాయతీ కార్యదర్శి సరిత ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలకు లింగ వివక్ష తగదని, పుట్టబోయే బిడ్డ లింగాన్ని తెలుసుకుని భ్రూణహత్యలకు పాల్పడటం చట్టరీత్యా నేరమని వివరించారు. ఆడపిల్ల భారమేమీ కాదని, దేవుడు ఇచ్చిన వరమన్నారు. ముల్కనూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలో బాలిక దినోత్సవం సందర్భంగా ఆడబిడ్డను పుట్టనిద్దాం.. రక్షిద్దాం.. చదివిద్దాం.. అనే నినాదంతో గర్భిణి స్త్రీలకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో వంగర వైద్యాధికారి డాక్టర్ రహ్మాన్, ముల్కనూర్ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, పీవీ రంగారావు గురుకుల ప్రిన్సిపాల్ అఫ్రీన్, సూపర్వైజర్ మోహన్, ఏఎన్ఎం స్వరూప, స్టాఫ్ నర్స్ హారిక, ముల్కనూర్ వైద్య సిబ్బంది భారతి, రాజు, వనజ, స్వరూప, ఆశా కార్యకర్తలు పుతిలి, పుష్పలత, ఆలేఖ్య,తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**వర్ధన్నపేట/జనవరి 24(జర్నలిస్ట్ వార్త),:** ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి జారీ పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ల్యాబర్తి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ల్యాబర్తి గ్రామానికి చెందిన
గీత కార్మికుడు నాల్లం సుధాకర్ గౌడ్ రోజు మాదిరిగానే వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కారు. ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని గుర్తించిన స్థానికులు చికిత్స నిమిత్తం108 సహాయంతో వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

**పరామర్శించిన కల్లు గీతా కార్మిక సంఘం నాయకులు**

ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలైన గీత కార్మికుడు నాల్లం సుధాకర్ గౌడ్ ను కల్లు గీతా కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు.ల్యాబర్తి గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాడిచెట్టు పైనుంచి కిందపడి ఎంజిఎం హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకున్న కల్లుగీత కార్మిక సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు తాళపెల్లి నర్సయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి మేరుగు విరస్వామి గౌడ్, గౌరవ సలహాదారులు సట్ల సూరయ్య గౌడ్, మండల అధ్యక్షులు జనగాం యాకయ్య గౌడ్, ల్యాబర్తి సొసైటీ అధ్యక్షులు బత్తిని రాజబాబు గౌడ్ ఎంజిఎం ఆసుపత్రికి వెళ్లి సుధాకర్ గౌడ్ ను పరామర్శించి, బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష సమావేశం

### త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచన



**భీమదేవరపల్లి/జనవరి24 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాచర్ల కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపిడివో వీరేశం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై ఇందిరమ్మ కమిటీ, అధికారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు నిర్మాణ పనులు మొదలు పెట్టాలని సూచించారు. తాపీ మేస్త్రీలు మొదలు పెట్టిన ఇళ్లని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ జనార్ధన్, ఉప సర్పంచ్ ఐలయ్య, పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# యెలగుట్ట వద్ద హైనా దాడి

### కమ్మరిపేటలో అడవి జంతు భయం రంగంలోకి దిగిన అటవీ శాఖ

**వేలేరు/హనుమకొండ బ్యూరో24 జనవరి (జర్నలిస్ట్ వార్త);** హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోని కమ్మరిపేట గ్రామం యెలగుట్ట సమీపంలో నునావత్ చంద్రు వ్యవసాయ బావి వద్ద హైనా సంచారం కలకలం సృష్టించింది. హైనా పశువులపై దాడి చేసి చంపిన ఘటన గ్రామంలో భయాందోళనలకు దారితీసింది. ఈ ఘటనను వెంటనే అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన వేలేరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు, కమ్మరిపేట గ్రామ సర్పంచ్ జోడుముంతల కిరణ్ స్పందనకు నాంది పలికారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని చేరుకుని హైనా సంచారానికి సంబంధించిన ఆనవాళ్లు, దాడి జరిగిన ప్రదేశాలను సవివరంగా పరిశీలించారు.
గ్రామ పరిసరాల్లో అడవి జంతువుల కదలికలపై స్థానికుల నుంచి వివరాలు సేకరించిన అధికారులు,








పశువులను రాత్రి వేళల్లో బహిరంగంగా వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామస్తులు అప్రమత్తంగాఉండాలని,అనుమానాస్పద కదలికలు కనిపిస్తే వెంటనే అటవీ శాఖకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని, అడవి జంతువుల సంచారాన్ని నియంత్రించేందుకు పర్యవేక్షణను పెంచుతామని తెలిపారు. పశువుల నష్టంపై సంబంధిత నిబంధనల ప్రకారం పరిహారం అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు. సర్పంచ్ జోడుముంతల కిరణ్ గ్రామస్తులతో సమావేశమై ధైర్యం చెప్పడంతో పాటు, గ్రామంలో భయాందోళనలు లేకుండా సహకరించాలని కోరారు. అటవీ శాఖ తక్షణ స్పందనపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# యాకయ్య మృతి కుటుంబానికి తీరని లోటు

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బిర్రు మహేందర్ తండ్రి యాకయ్య కుటుంబాన్ని పరామర్శించిన మందకృష్ణ మాదిగ. వర్ధన్నపేట ఎమ్మెల్యే













**వర్ధన్నపేట/జనవరి24(జర్నలిస్ట్ వార్త)**
వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం నల్లవెల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బిర్రు మహేందర్ మాదిగ తండ్రి బిర్రు యాకయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ యాకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ఈ దుఃఖ సమయంలో ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ తమకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బిర్రు యాకయ్య మృతి ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్న మందకృష్ణ మాదిగ, మహేందర్ మాదిగ సేవలను కొనియాడుతూ, ఆయన కుటుంబానికి పార్టీ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంతాపం తెలిపారు.

### బిర్రు యాకయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

నల్లబెల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ఎంఎస్పి రాష్ట్ర నాయకులు, భువనగిరి జిల్లా ఇన్‌చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ తండ్రి బిర్రు యాకయ్య అనారోగ్యంతో మృతి చెందాగా. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు నివాసానికి వెళ్లి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ బిర్రు యాకయ్య మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్ రావు, ఇల్లంద మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు మన్నే బాబురావు, బిర్రు మౌనిక రాజు, జక్కి గోపాల్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తుల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

### బాపు సేవలు మరువలేనివి... ఎమ్మార్పీఎస్ నాయకులు...

మీరు యాకయ్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకత్వం మొత్తం



నల్లబెల్లి గ్రామానికి భారీగా తరలివచ్చారు. ఉద్యమాలు తనకు సహచరుడుగా ఉంటూ మంచి సలహాలు అందించిన విషయాన్ని నెమరు వేసుకున్నారు. చదువురాని ప్రొఫెసర్ గా
తాను జ్ఞానాన్ని ప్రజలకు పంచడంతోపాటు ఉద్యమంలో తమకు తమ మాటలు ఎంతో సహలహాలు ఆలోచింపజేసే విధానం తనలో ఉందని గుర్తు చేసుకున్నారు. మందకృష్ణ మాదిగ ఆశయ సాధన కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి బీరు యాకయ్య బాబు అని తన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రతి ఒక్కరూ తమ మాటల్లో తెలిపారు. ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద కుమార్ మాట్లాడుతూ యాకయ్య బాబు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

### తెలంగాణ అంబేద్కర్ సంఘం, జై భీమ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా యాకయ్యకు ఘన నివాళి...

నల్లబెల్లి గ్రామంలో ఎంఆర్‌పీఎస్ఎంఎస్‌పీ జిల్లా ఇంచార్జి బిర్రు మహేందర్ మాదిగ తండ్రి బిర్రు యాకయ్య, అనారోగ్యంతో పరమపదించారు. వారి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ సందర్భంగా యాకయ్య పార్థివ దేహానికి పూలమాలలు వేసి పలువురు దళిత, సామాజిక నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొండేటి శ్రీనివాస్, జై భీమ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయల కుమార్, కొందూరు బాబు, ఎంఆర్‌పీఎస్ఎంఎస్‌పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతుడికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ, బిర్రు యాకయ్య సాదాసీదా జీవితం గడుపుతూ



కుటుంబానికి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### అంతిమయాత్రలో పాల్గొన్న దళిత సంఘాలు,

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మహేందర్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న దళిత ఉద్యమ సంఘాలు. యాకయ్య మృతి అంతిమయాత్రలో పాల్గొని తమ సందేశాన్ని అందిస్తూ ఆటపాట రూపంలో తమతో ఉన్న బంధాన్ని పంచుకున్నారు. భారీ సంఖ్యలో తమ కుటుంబాన్ని ఆదరించడానికి వచ్చిన ప్రజలు యాకయ్య మృతి మరువలేని గుర్తు చేసుకున్నారు.

### సాఫీగా సమాది కార్యక్రమం ...

బిర్రు యాకయ్య అనారోగ్యంతో మృతి చెందగా శనివారం తమ సమాది కార్యక్రమం సాఫీగా జరిగింది స్థానిక పోస్టర్ రెవరెండ్ ప్రకాష్, పాస్టర్ సుమన్, పర్వతగిరి మండల పాస్టర్ నాయకులు తిమోతి, వరంగల్ పాస్టర్ దేవేందర్ ఆధ్వర్యంలో యేసు ప్రభు ప్రార్ధనలు, పాటలతో సాఫీగా ముగించారు. ఏసుప్రభు నిజమైన సేవకునిగా యాకయ్య తమ జీవితాన్ని గడిపడాని గుర్తు చేశారు. ప్రతి మానవుడు ఈ లోకంలో మృతి చెందడం ఖాయమని. మనిషిని మనిషిలాగా ప్రేమించాలన్నారు,















